నెక్కొండ: గొట్లకొండలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి, కలెక్టర్

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి, కలెక్టర్

నెక్కొండ/దుగ్గొండి/ వర్ధన్నపేట, ఏప్రిల్ 18: రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. మండలంలోని గొట్లకొండలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని నిర్వాహకులను దొంతి ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ హార్వెస్టర్ల ద్వారా వరికోత విధానంపై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎస్‌వో కిష్టయ్య, సివిల్ సప్లయ్స్ డీఎం సంధ్యారాణి, నాయకులు పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండలంలోని మందపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి నీరజ, నోడల్ ఆఫీసర్ విజయ భాస్కర్‌రెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి కిష్టయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, ఏడీఏ దామెదర్‌రెడ్డి, ఏవో మాధవి, తహసీల్దార్ రవిచంద్రరెడ్డి, ఏఈవో వైజయంతి, సొసైటీ చైర్మన్ గుడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ సింగతి కార్తీక్, ఇన్‌చార్జి సీఈవో ఆరెల్లి భిక్షపతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే, వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి, వెంకట్రావుపల్లెలో కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్‌ఖన్నా ప్రారంభించారు. ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌గౌడ్, పత్రి భాను, మహేందర్‌రెడ్డి, వలీపాషా, ప్రశాంత్, రాములు పాల్గొన్నారు.

ఆ ఠాణాలో ఆయనంటే హడల్

- అక్రమ వ్యాపారులతో అంటకాగుతున్న ఎస్సై
- ఆరా తీస్తున్న నిఘా వర్గాలు

వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 18: శాంతిభద్రలను పరిరక్షించాల్సిన ఓ పోలీస్ అధికారి తన సెక్టార్ పరిధిలో అక్రమ వ్యాపారులతో అంటగాకుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా పేరుగాంచిన వ్యాపార కేంద్రం వీధిలో అక్రమ వ్యాపారులకు అండదండలు అందిస్తూ నిషేధిత ఉత్పత్తుల విక్రయదారులకు ఆయన అభయమిస్తూ వ్యాపారాలకు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ అధికారులు నిత్యం నిషేధిత పొగాకు ఉత్పత్తులను పట్టుకుంటున్నా ఆయన పర్యవేక్షిస్తున్న సెక్టార్‌లో మాత్రం స్థానిక పోలీసులు ఒక్క రోజు దాడులు చేసింది లేదు. రాత్రి వేళల్లో వ్యాపారాలు నిర్వహించుకునే చిరువ్యాపారులకు సైతం ఆయనంటే హడల్. ఆయన కంట్లో పడితే అంతే సంగతులంటూ భయంభయంగా వ్యాపారాలు నిర్వహించు కోవాల్సి వస్తున్నదని నిట్టూరుస్తున్నారు. గతంలో ఓ చిరువ్యాపారి ఈ ఎస్సై వేధింపులు భరించలేక స్టేషన్ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసు సిబ్బందే చెబుతున్నారు. న్యాయం కోరుతూ స్టేషన్‌కు వచ్చిన వారిని సైతం వదలే ప్రసక్తే లేదంటూ తనదైన చేతివాటాన్ని ప్రదర్శిస్తుండడంతో తోటి అధికారులు సైతం ఆశ్చర్యానికి గురవుతున్నారు. కాగా, ఈ ఎస్సై తీరుపై పోలీస్ ఉన్నతాధికారులు నిఘా వర్గాలతో ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అంతర్గత విచారణ జరుగుతున్నట్లు తెలిసింది. నివేదిక అందిన వెంటనే తగిన చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

పార్లమెంటరీ కమిటీ సిఫారసులు అమలు చేయాలి

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 18: కేంద్ర ప్రభుత్వం వెంటనే పార్లమెంటరీ కమిటీ సిఫారసులను అమలు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియర్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న ఉపాధి కూలీలకు పని దినాల సంఖ్యను 150 రోజులకు పెంచాలని, వేతనాలు రోజుకు కనీసం రూ. 400 చెల్లించాలని, గ్రామీణ పంచాయతీరాజ్ శాఖపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సిఫారసులను తక్షణమే ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాతావరణ కరువు ఉపశమన నిబంధన కింద, అడవి ప్రాంతాల్లో షెడ్యూల్ తెగల కుటుంబాలకు ఉపాధిహామీ పథకం కింద 200 రోజులు పని దినాలు కల్పించాలని కోరారు. కూలీకి రోజా కనీసం రూ. 700 ఇవ్వాలన్నారు.

ప్రాణం తీసిన కోతులు

రాయపర్తి, ఏప్రిల్ 18: మండలంలోని పెరికవేడుకు చెందిన వృద్ధురాలు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. గ్రామానికి చెందిన దూరిశెట్టి మల్లమ్మ(75) ఈ నెల 10న స్నానం చేసేందుకు బకెట్‌లో వేడినీళ్లు తీసుకొని బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఈ క్రమంలో కోతుల గుంపు ఆమెపై అకస్మాత్తుగా దాడి చేయడంతో బకెట్‌లోని వేడినీళ్లు వృద్ధురాలిపై పడి తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తొర్రూరులోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త యాకయ్య, కుమారుడు, ఆరుగురు కుమార్తె ఉన్నారు.

మల్లమ్మ(ఫైల్)

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★ వరంగల్ హైవే రఘునాథ్‌పల్లికి దగ్గరలో 2 లక్షలకే 121 Sq.yds. Plots అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్. ఫోన్: 8523041059.
NT-329891

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

నేడు రైతులకు అవగాహన సదస్సు

నల్లబెల్లి, ఏప్రిల్ 18: భూ భారతిపై నేడు నెక్కొండ మండలం గొట్లకొండ, దుగ్గొండి మండంలోని గిర్నిబావి, నల్లబెల్లి మండలకేంద్రంలోని రైతు వేదికల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆర్డీవో పాలం ఉమారాణి తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద పాల్గొంటారని తెలిపారు.

నర్సంపేట: 7వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్

దుగ్గొండి: వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మహాసభకు దండులా తరలిరావాలి

- బీఆర్‌ఎస్ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్
- పట్టణంలో ఇంటింటి ప్రచారం
- గ్రామగ్రామాన సన్నాహక సమావేశాలు, వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

నర్సంపేట, ఏప్రిల్ 18: బీఆర్‌ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు దండులా తరలిరావాలని పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని 6వ, 7వ వార్డుల్లో శుక్రవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అందించిన సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. అనంతరం బహిరంగ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, మాజీ కౌన్సిలర్లు మండల శ్రీనివాస్, బండి రమేశ్, పెండెం వెంకటేశ్వర్లు, వాసం సాంబయ్య, రామసహాయం శ్రీదేవి–సుధాకర్‌రెడ్డి, నాయకులు చింతం విజయలక్ష్మి, దొంగల సురేశ్, దుగ్గిరాజు, రవి, భిక్షపతి, ఎల్లయ్య, కట్టయ్య, శ్రీను, కొమురయ్య, సాంబయ్య, సాయికృష్ణారెడ్డి, రవీందర్‌రెడ్డి, వీరన్న పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట, రాజుపేట, ముత్యాలమ్మతండాలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఎల్కతుర్తి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి భాగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జిలు గోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రవి, రవన్న, నర్సయ్యగౌడ్, వీరన్ననాయక్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలి

చెన్నారావుపేట/నల్లబెల్లి/దుగ్గొండి: ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బాల్నె వెంకన్న పిలుపునిచ్చారు. చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, బోజెర్వు, పుల్లాయబోడుతండా, ఎల్లాయగూడెం, 16 చింతల తండా, బోడ మాణిక్యం తండాలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. అనంతరం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నాయకులు జక్క అశోక్, పత్తినాయక్, కంది కృష్ణచైతన్యరెడ్డి, కుమారస్వామి, భిక్షపతి, బద్దూనాయక్, సమ్మునాయక్, కేశవరెడ్డి, దేవ్‌సింగ్, మురళీనాయక్ పాల్గొన్నారు. అలాగే, నల్లబెల్లి మండలంలోని బోల్లోనిపల్లె, రాంపూర్, మూడుచెక్కలపల్లెలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించి ప్రచార వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. రజతోత్సవ సభకు మండలంలోని పార్టీ నేతలు ఉప్పెనలా కదిలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్‌రావు, నాయకులు తిప్పని రవీందర్, మాజీ సర్పంచ్‌లు సురేశ్‌రావు, పోలుదాసరి రమేశ్, లావుడ్యా తిరుపతి, గాదం రాజ్‌కుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు. దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, దేశాయిపల్లి, పొనకల్, రాజ్యాతండా, రేబల్లెలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొన్నారు.

నల్లబెల్లి: బోల్లోనిపల్లెలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి

గుడుంబా తరలిస్తున్న ఒకరి అరెస్ట్

వర్ధన్నపేట, ఏప్రిల్ 18: మున్సిపాలిటీ పరిధి డీసీతండా నుంచి గుడుంబాను తరలిస్తున్న ఒకరిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. శుక్రవారం డీసీతండా సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై గుడుంబా తరలిస్తున్న మూడు మోహన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్సై సరిత, గంగాధర్, జవాన్లు వెంకటేశ్, రమేశ్, బాబు, శరత్‌కుమార్, వంశీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే వేడుకలు

చెన్నారావుపేట/కాశీబుగ్గ/గీసుగొండ, ఏప్రిల్ 18: చెన్నారావుపేట మండలంలోని చెన్నారావుపేట, తిమ్మరాయిన్‌పహాడ్‌లో భక్తిశ్రద్ధలతో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చెన్నారావుపేటలోని సీఎస్ఐ చర్చిలో రెవా సహోదర్ ప్రార్థనలు చేశారు. కాశీబుగ్గ 19వ డివిజన్ భగత్‌నగర్‌లోని బేతస్థ బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గీసుగొండ మండలంతోపాటు వరంగల్ 15, 16వ డివిజన్‌లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కరీమాబాద్, ఏప్రిల్ 18: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరీమాబాద్ వాటర్ ట్యాంకు సమీపంలో పేకాడుతున్న వ్యక్తులను శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ. 22,390 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ప్లేకార్డ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిలో ఒకరు పరారు కాగా, ముగ్గురిని మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

ఐదో రోజుకు చేరిన జర్నలిస్టుల దీక్షలు

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 18: దేశాయిపేట లక్ష్మీ మెగా టౌన్‌షిప్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్లు కేటాయించాలని కోరుతూ జర్నలిస్టులు చేపట్టిన నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యారా ప్రశాంత్, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి వలదాసు దుర్గయ్య, బీజేవైఎం వరంగల్ నేతలు, రాష్ట్ర కుమ్మరుల సంఘం అధ్యక్షుడు ఆకారపు మోహన్, నవ తెలంగాణ వికలాంగుల అధ్యక్షుడు అజీమ్ జర్నలిస్టులకు సంఘీభావం ప్రకటించారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత

నెక్కొండ, ఏప్రిల్ 18: ఎస్సై మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు నెక్కొండ–పెద్దకోర్పోలు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను ట్రాక్టర్లతో మొరం తెప్పించి శుక్రవారం పూడ్చివేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి క్లియర్ చేశారు. నెక్కొండ ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను సైతం పూడ్చివేయించారు.

పెద్దకోర్పోలు మార్గంలో గుంతలు పూడ్చివేయిస్తున్న ఎస్సై

స్టెరాయిడ్స్ విక్రయిస్తున్న ఒకరి అరెస్ట్

- వైజాగ్ నుంచి తీసుకొచ్చి నగరంలో అమ్మకాలు
- ఏసీపీ నందిరాంనాయక్

నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్‌చౌరస్తా, ఏప్రిల్ 18: తక్కువ సమయంలో శారీరక దృఢత్వాన్ని సాధించాలనుకునే యువతను టార్గెట్ చేస్తూ నగరంలో నిషేధిత స్టెరాయిడ్స్ విక్రయిస్తున్న ఒకరిని మట్టెవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ వివరాలు వెల్లడించారు. మంగళికుంట డాక్టర్స్ కాలనీ–2 మార్కండేయ వీధికి చెందిన కందగట్ల శ్రావణ్‌కుమార్ (అలియాస్ కిరణ్) నిషేధిత స్టెరాయి డ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అతడి ఇంట్లో తనిఖీ లు నిర్వహించారు. సుమారు రూ. 20 వేల వి లువైన స్టెరాయిడ్స్ లభించాయి. శ్రావణ్‌కుమార్‌కు బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి ఉండడంతో ఐదేళ్ల క్రితం సుబేదారి ప్రాంతంలోని జేడీ జిమ్‌లో శిక్షణ తీసుకున్నాడు. ఈ సమయంలో ఆన్‌లైన్‌లో పరిచయమైన ప్రశాంత్ త్వరగా శారీరక దృఢత్వాన్ని సాధించాలంటే స్టెరాయిడ్స్ వినియోగించాలని సూచించాడు. దీంతో శ్రావణ్‌కుమార్‌కు అతడు స్టెరాయిడ్స్ విక్రయించాడు. నా టి నుంచి శ్రావణ్‌కుమార్ స్టెరాయిడ్స్ వినియోగించడంతోపాటు వైజాగ్‌కు చెందిన మణికంఠ, ఆనంద్ నుంచి స్టెరాయిడ్స్ కొనుగోలు చేస్తూ శారీరక దృఢత్వాన్ని పెంచుకోవాలనుకునే వారికి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో పట్టుబడ్డాడు. ఈ కేసుతో సంబంధం ఉన్న ప్రశాంత్, మణికంఠ, ఆనంద్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ తెలిపారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

నర్సంపేట, ఏప్రిల్ 18: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ఏసీపీ కార్యాలయాన్ని శుక్రవారం సాయంత్రం ఈస్ట్‌జోన్ డీసీపీ తనిఖీ చేశారు. రికార్డులు, క్రైం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, పురోగతిపై ఆరా తీశారు. అనంతరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్పెషల్ ట్రెయిన్డ్ నార్కో అనాలసిస్ డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. బస్టాండ్‌లోని అన్ని రకాల వస్తువులు, ప్రయాణికుల మూటలు, బ్యాగులను డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల నివారణకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సైలు గూడ అరుణ్ కుమార్, రవికుమార్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నల్ల ముసుగుతో గుడిసె వాసుల వినూత్న నిరసన

నర్సంపేట, ఏప్రిల్ 18: ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి, పట్టణంలోని అంబేద్కర్ నగర్ గుడిసె వాసులకు ఇండ్ల పట్టాలు అందించాలని కోరుతూ గుడిసె వాసులు శుక్రవారం నల్ల ముసుగుతో వినూత్నంగా నిరసన తెలిపా రు. రిలే నిరాహార దీక్షల్లో ఎమ్మార్పీఎస్ జాతీ య ప్రతినిధి కల్లెపల్లి ప్రణయ్‌దీప్, డీబీడీపీఎస్ ప్రజా దండోరా జాతీయ అధ్యక్షుడు అందె రవి, మహజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్, విమల, విజయ, సమ్మక్క, సరస్వతి, సుధారాణి, బారాజు, రత్నం, సాం బయ్య, సాంబలక్ష్మి, స్వరూప, మల్లికాంబ, సారమ్మ, రాజు, సదానందం, వెంకన్న పాల్గొన్నారు.

ముసుగు వేసుకొని నిరసన తెలుపుతున్న గుడిసె వాసులు

బస్టాండ్‌లో సిమెంట్ బల్లాలను ప్రారంభిస్తున్న దయాకర్‌రావు

ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటా

రాయపర్తి, ఏప్రిల్ 18: పాలకుర్తి నియోజకవర్గంలోని సబ్బండ వర్గాల ప్రజలందరి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలకేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ యువజన నాయకుడు బండారి అశోక్‌కుమార్ కాలు ఇటీవల ప్రమాదవశాత్తు విరిగింది. చికిత్స అనంతరం ఆయన ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న ఎర్రబెల్లి ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మైలారం గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ రంగుకుమార్ కుమార్తె కల్పన వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహనాయక్, పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, గారె నర్సయ్య, రాంచందర్, అక్బర్, సుధాకర్ తదితరులు ఉన్నారు. అలాగే, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లాలను ఎర్రబెల్లి ప్రారంభించారు. ప్రతినిధులు రంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, సురేందర్‌రాథోడ్, రత్నాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, యాదగిరి, వెంకటయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి : కలెక్టర్

వరంగల్, ఏప్రిల్ 18: రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులు, యూనిట్ల ఎంపిక పారదర్శకంగా జరగాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకంపై శుక్రవారం ఆమె బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ శాఖల అధికారులతో సమీక్షించారు. మండలస్థాయి కమిటీల ద్వారా యూనిట్లను ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులను ఎంపిక చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సమీక్షలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు, బీసీ వెల్ఫేర్ అధికారి పుష్పలత, ఈడీఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేశ్, మైనార్టీ వెల్ఫేర్ అధికారి రమేశ్, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య పాల్గొన్నారు.

జస్టిస్ సుజోయ్ పాల్‌ను కలిసిన కలెక్టర్

తెలంగాణ రాష్ట్ర తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్‌ను కలెక్టర్ సత్యశారద మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణ, కమ్యూనిటీ మీడియేషన్ వలంటీర్స్ కార్యక్రమంలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన ఆయనను ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

మాట్లాడుతున్న జగన్మోహన్‌రావు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని దుయ్యబట్టారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ నాయకులు ఫణికుమార్, పాలకుర్తి సదానందం, ఈగ వెంకటేశ్వర్లు, హేమానాయక్, గద్దల రాజు, శేంకేసి రాజేశ్, సాంబయ్య, విజయకుమార్, సారయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రతి ఒక్కరూ ఆదరించాలి

నర్సంపేట, ఏప్రిల్ 18: ఆర్టీసీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆర్టీసీ నర్సంపేట డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి కోరారు. పట్టణంలోని టీజీఎస్ఆర్టీసీ నర్సంపేట డిపో, బస్టాండ్ ఆవరణలో కర్టసీ డే (మర్యాదపూర్వకమైన) సందర్భంగా డీఎంతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులకు గులాబీ పూలు అందించి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులు ప్రయాణికులతో మర్యాదగా మాట్లాడాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులను చిరునవ్వుతో పలకరిస్తూ విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ భవానీ, ఏడీసీలు మంచిక మల్లికార్జున్, రవీందర్, రాంబాబు, తేజశ్విని, వీరారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవం

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 18: వరంగల్ దేశాయిపేటలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత కలుసుకుని శుక్రవారం స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. 1972–1975 బీఎస్సీ, బీజడ్సీ (టీఎం) విద్యార్థులు కళాశాలలో శుక్రవారం ఆనాటి అధ్యాపకులను ఘనంగా సత్కరించి, గురుభక్తిని చాటుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకొని ఆనందంగా గడిపారు.

సీకేఎం కాలేజీలో చదువుకున్న పూర్వ విద్యార్థులు

ఇలాగైతే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు ఎలా?

- రెండున్నరేళ్లుగా గ్యారేజ్‌లో మూడు స్వీపింగ్ మిషన్లు
- బిల్లు చెల్లించడంలో బల్దియా అధికారుల నిర్లక్ష్యం
- నేడు నగరానికి కేంద్ర బృందం

మూలనపడిన స్వీపింగ్ మిషన్లు

వరంగల్, ఏప్రిల్ 18: స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ర్యాంకు సాధించాలన్న కోరిక ఉంటే చాలదు. ఆ దిశగా అడుగులు వేయాలి. శనివారం నగరానికి గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో కేంద్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నది. నగర పరిశుభ్రతను ప్రత్యేకంగా చూడనుంది. కాగా, రోడ్లు ఊడ్చే మిషన్లు ఏడాదిగా మూలన పడ్డా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించాలన్న ప్రకటనలు తప్ప ర్యాంకు సాధించడంపై శ్రద్ధ పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడు పెద్ద స్వీపింగ్ మిషన్లు గ్యారేజ్‌లో ఉంటే మరికొన్ని బల్దియా ఆవరణలో మూలన పడ్డాయి. నగర రోడ్లు శుభ్రంగా ఉంచాలనే లక్ష్యంతో స్వచ్ఛ సర్వేక్షణ్ నిధులతో 12 స్వీపింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. అయితే మూడు స్వీపింగ్ మిషన్లు మరమ్మతు చేసిన బిల్లులు చెల్లించక పోవడంతో టాటా మోటర్ యాజమాన్యం వాటిని గ్యారేజ్‌లోనే ఉంచారు. రెండున్నర ఏళ్లు దాటినా వాటిని తీసుకురావడం లేదు. ఈ క్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులో భాగంగా నగరానికి రెండు బృందాలు వస్తున్నాయి. ఇళ్ల నుంచి చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత, ఓడీఎఫ్ లాంటి అనేక కేటగిరీల్లో మార్కులు కేటాయిస్తారు. ముఖ్యంగా గార్బేజ్ ఫ్రీ సిటీ, ఓడీఎఫ్ బృందాలు రోడ్లు శుభ్రం చేయడంలో వినియోగిస్తున్న సాంకేతికతను పరిగణలోకి తీసుకోనున్నాయి. అయితే స్వీపింగ్ మిషన్లు మూలనపడి ఉన్న పరిస్థితుల్లో బృందానికి బల్దియా అధికారులు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి. గార్బేజ్ ఫ్రీ సిటీ కేటగిరీలో 1,250 మార్కులు ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులో ఈ మార్కులు కీలకం కానున్నాయి.

ముందుకెళ్లని 'ఎల్‌ఆర్‌ఎస్'

- ప్రొసీడింగ్స్‌పై దృష్టి పెట్టని బల్దియా
- ఇంకా మొదలుపెట్టని క్షేత్రస్థాయి పరిశీలన
- ఇప్పటికే 15 వేలకుపైగా దరఖాస్తులు
- ఆందోళనలో ఫీజులు చెల్లించిన దరఖాస్తుదారులు

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పటికే గ్రేటర్ వరంగల్‌లో 15 వేలకు పైగా దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. సుమారు రూ. వంద కోట్లకు పైగానే బల్దియాకు ఆదా యం సమకూరింది. ఇప్పటికి నెల రోజులు కావస్తున్నా ఎల్‌ఆర్‌ఎస్ ప్రొసీడింగ్స్ జారీ చేయలేదు. మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే వీటిని ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటికీ ఆ ప్రక్రియనే మొదలుపెట్టకపోవడంతో దరఖాస్తు దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం రూ. వెయ్యి చెల్లించి ఐదేళ్లు ఎదురు చూశామని, రూ. లక్షల ఫీజులు చెల్లించి ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాల్సి వస్తుందోనని మదనపడుతున్నారు. *- వరంగల్, ఏప్రిల్ 18*

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ ప్రకటించడంతో పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. అయితే వారికి ఇప్పటి వరకు ఎలాంటి ధ్రువీకరణ ప్రతం అందకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించిన దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన ఇంకా మొదలు పెట్టలేదు. మూడు శాఖల మధ్య సమన్వయం కుదరకపోవడంతో అది నత్తనడకన సాగుతున్నది. ప్రస్తుతం పెద్ద ఎత్తున ఫీజులు చెల్లించిన దరఖాస్తులను పరిశీలించి వేగవంతంగా ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సిన తరుణంలో బల్దియా అధికారులు ఇంకా దరఖాస్తుల పరిశీలన మొదలు పెట్టకపోవడం గమనార్హం.

ప్రణాళికలు లేవు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై బల్దియా అధికారులు ఎలాంటి ప్రణాళికలు చేయలేదు. కేవలం ఫీజులు కట్టించుకొని చేతులు దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఏప్రిల్ 30 వరకు రాయితీ గడువును ప్రభుత్వం పొడిగించడంతో అనేక మంది ఫీజులు చెల్లిస్తున్నారు. అయితే మార్చి 31 వరకు సుమారు 15 వేల దరఖాస్తుదారులు ఫీజులు చెల్లించారు. వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించే ప్రక్రియపై ఎలాంటి కార్యాచరణ చేయలేదు. ఇప్పటికే 30 మంది వార్డు అధికారులు, కొత్తగా వచ్చిన వారితో కలిపి 21 మంది టీపీబీవోలు ఉన్నారు. వార్డు అధికారులు, టీపీబీవోలను దరఖాస్తుల పరిశీలనలో వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. 25 శాతం రాయితీకి ఏప్రిల్ 30 వరకు చివరి గడువు ఉండడంతో మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశాలు ఉన్నాయి. వాటన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్రూవల్ ఇచ్చేదెప్పుడో అని దరఖాస్తుదారులు వాపోతున్నారు.